ఆడపిల్లగా పుట్టడమే నేరమా..?



కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన ఘటన దారుణం. ప్రభుత్వాలు ఎన్ని చెప్తున్నా, ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. సమాజంలో ఆడపిల్లగా పుట్టడమే నేరమాననే ఆవేదన కలుగుతోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. దోషులను తక్షణమే శిక్షించాలి.

– దివ్య, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్, సర్వజన ఆస్పత్రి

తప్పు చేయాలన్న ఆలోచనే రాకూడదు



సమాజంలో మహిళలు ఏదో ఒక రూపంలో దాడులకు గురవుతూనే ఉన్నారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడే వారిని అత్యంత కఠినంగా శిక్షించాలి. ఇలాంటి శిక్షలను చూసి తప్పు చేయాలంటే భయపడేలా చట్టాలను తీసుకురావాలి. వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– దీప్తి, జూనియర్ డాక్టర్

ప్రత్యేక చట్టంతోనే రక్షణ



మహిళలు, మహిళా డాక్టర్లపై వేధింపులకు పాల్పడే వారిని శిక్షించేందుకు ఇప్పుడున్న చట్టాలు చాలవు. మృగాళ్ల తరుముతుంటే యాప్‌లో వివరాలను నమోదు చేసేంత సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి అకృత్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. పాఠశాల స్థాయి నుంచే బాలికలకు మానసిక ధైర్యంతో పాటు కరాటేను నేర్పించాలి.

– ప్రశాంతి, డాక్టర్, జీజీహెచ్



క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు శనివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. అనంతరం పల్లకిసేవ వైభవంగా జరిగింది. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

బకాయిల మంజూరుకు వినతి

నెల్లూరు(దర్గామిట్ట): తమకు గతంలో ఉన్న బకాయిలను వెంటనే మంజూరు చేసేలా సీఎం , పౌరసరఫరాల శాఖ మంత్రి చొరవ చూపాలని నెల్లూరు రైస్ మిల్లర్స్, డీలర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటనను విడుదల చేశారు.

సైనిక్ క్యాంపునకు 'డీకేడబ్ల్యూ' విద్యార్థి



నెల్లూరు (టౌన్): ముంబైలో నిర్వహించనున్న ఆలిండియా నౌ సైనిక్ క్యాంపునకు షిప్ మోడలింగ్ విభాగంలో నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ నావెల్ యూనిట్ నుంచి విద్యార్థిని వెంకటరమణ ఎంపికైందని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. సహకారం అందించిన 10ఏ నావల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ గణేశ్, షిప్ మోడలింగ్ ఇన్‌స్ట్రక్టర్ రామన్‌ను అభినందించారు. పీఐ స్టాఫ్ వెంకటేష్ రాథోడ్, సుధాకర్, లోకేష్, నావల్ యూనిట్ కేర్ టేకర్ దివ్య పాల్గొన్నారు.

సేవల్లో ముందుండాలి

నెల్లూరు (టౌన్): సేవా కార్యక్రమాల్లో ముందుండాలని జీఎస్టీ (ఆడిట్) కమిషనర్ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పేదలకు సాయం చేసేందుకు కులమతాలకతీతంగా ముందుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలను అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్, నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌ఓడీ కణ్ణన్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ఏఆర్కే చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి కృపావతి, కోశాధికారి హనోక్, సభ్యులు మురళి, బాలయ్య, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉత్సవ సమితి నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ ఆనంద్‌ను విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఆయనకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం నేతలు మాట్లాడారు. గతేడాది తరహాలోనే ఈ ఏడాది సింగిల్ విండో పద్ధతిన అనుమతి పత్రాలను కార్పొరేషన్, పోలీస్, విద్యుత్, ఫైర్ శాఖలు జారీ చేసేలా చూడాలని కోరారు. మల్లికార్జునరెడ్డి, మహేష్, బండి ప్రసాద్, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, సుబ్రహ్మణ్యం, కొండపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశం నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని విజయమహల్ గేట్ సెంటర్‌లో గల సాయికృష్ణ ఫంక్షన్ హాల్లో గణేశ్ ఉత్సవ మండపాల నిర్వాహకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం ఉదయం నిర్వహించనున్నామని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి తెలిపారు. వివరాలకు 94402 75274 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా ఆరాధనోత్సవం



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు : మనుబోలు బీసీ కాలనీ సమీపంలోని వెంకయ్య స్వామి ఆలయంలో ఆరాధనోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు ఉదయం మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం నిర్వహించి వెంకయ్యస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. నదీజలాలతో శిఖరానికి అభిషేకం గావించారు. భక్తులు కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పూజలు జరిపారు. భక్తులతో విష్ణు సహస్రనామ పారాయణం చేయించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం బయట హోమ గుండం వేసి శాస్త్రోక్తంగా ధుని పూజ చేశారు. కల్యాణం, సంతానం కోసం భక్తులు నవధాన్యాలను హోమ గుండంలో వేసి వ్రతాలు ఆచరించారు. ఉభయకర్తలుగా ముంగర విజయభాస్కర్‌రెడ్డి–విజయమ్మ దంపతులు వ్యవహరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవతో ఆరాధన మహోత్సవాలు ముగిశాయి.



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

రాజకీయ వేదికలుగా గ్రామసభలు



గ్రామసభ నుంచి వెళ్లిపోతున్న గ్రామస్తులు

కోవూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులను గుర్తించేందుకు నిర్దేశించిన గ్రామసభలు టీడీపీ సమావేశ వేదికలుగా మారాయి. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఈ గ్రామసభలు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా జరుగుతున్నాయి. వీరంతా ఉపాధి హామీ పనుల గుర్తింపును పక్కనబెట్టి రాజకీయ ఉపన్యాసాలు, గత పాలకులపై ఆరోపణలకే పరిమితమయ్యారు. మండలంలోని దండిగుంటలో సర్పంచ్ బెల్లంకొండ సుప్రజ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. అయితే సభా వేదికపైకి టీడీపీ నేతలను అధికారులు ఆహ్వానించారు. ప్రభుత్వ కార్యక్రమంలో వీరందరూ రాజకీయ ప్రసంగాలు చేశారు.

• విడవలూరు మండలంలోని వరిణి పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో కొందరు టీడీపీ నేతలు అసహనం వ్యక్తం చేశారు. గ్రామసభకు అధికారులు హాజరు కాలేదని, ఏ సమస్యను ప్రస్తావించినా తమకు తెలియదనే సమాధానాలివ్వడంతో స్థానిక టీడీపీ నేత మద్దులూరి రాజయ్య అధికారులతో వాగ్వాదానికి దిగారు.

• విడవలూరు మండలం ఊటుకూరులో నిర్వహించిన గ్రామసభలో బీజేపీ, టీడీపీ మధ్య వర్గ పోరు భగ్గుమంది. అక్కడ జరుగుతున్న సభకు బీజేపీ నేత వచ్చారు. అదే సమయంలో ఆమెను రాష్ట్ర అధికారి అనుకొని వేదికపైకి ఆహ్వానించారు. అదే గ్రామానికి చెందిన బీజేపీ నేత నాగేంద్రను ఆమె పొడగటంతో టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న సుప్రజ

విడవలూరు: గత ప్రభుత్వ హయాంలో దండిగుంట గ్రామంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిని అందించామని సర్పంచ్ బెల్లంకొండ సుప్రజ పేర్కొన్నారు. ఈ మేరకు దండిగుంటలో తన భర్త బెల్లంకొండ శ్రీధర్‌తో కలిసి విలేకరులతో శనివారం ఆమె మాట్లాడారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో కొందరు టీడీపీ నేతలు తనపై అమర్యాదగా మాట్లాడారని, ఏకవచనంతో సంబోధించారని, తమ భర్త మందు తాగి సభకు హాజరయ్యారంటూ అసత్యాలు ప్రచారం చేశారని ఆరోపించారు. మూడున్నరేళ్లలో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. గ్రామంలో జరిగే అభివృద్ధి పనులపై అవగాహన లేని టీడీపీ నేతలు తనను, తన భర్తను అవమానించాలనే ఉద్దేశంతో గ్రామసభలో భయానక వాతావరణాన్ని సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కాగొల్లు చిన్నమస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుగ్గుంటరాజుపాళెం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ముప్పాళ్ల మోహన్‌రాజు గురువారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుటుంబాన్ని కాకాణి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోహన్‌రాజు పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పటిష్టత కోసం పాటుపడినట్లు తెలిపారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు పెదమల్లు రమణారెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ కేతు రామిరెడ్డి, సర్పంచ్‌లు వెంకటరమణయ్య, ఎం.ఓబుల్‌రెడ్డి, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు



పొదలకూరు : పట్టణానికి సమీపంలో నుడా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లే–అవుట్లలో శనివారం హెచ్చరిక బోర్డులు నాటారు. అనధికారిక లే–అవుట్లలో ప్లాట్లు కొనరాదు, అమ్మరాదని పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. నుడా నుంచి వచ్చిన అధికారి కాలేషా స్థానిక సచివాలయ సెక్రటరీ వంశీతో కలిసి అనుమతి లేని శివాడ రాధారెడ్డి(1.16 ఎకరాలు), చెన్నారెడ్డి వెంకురెడ్డి(2.86 ఎకరాలు), మద్దినేని ప్రసాద్(4.10 ఎకరాలు), కొమ్మి సరోజనమ్మ(2.20 ఎకరాలు), కె.బ్రహ్మయ్య(0.99 ఎకరాలు) లేఅవుట్లలో బోర్డులను ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : పట్టణంలోని బాలాజీనగర్, శ్రీనివాస లేఅవుట్, రిజిస్ట్రేషన్ ఆఫీసు వీధి, రమణారెడ్డి కాలనీ, లింగంపల్లి ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ శనివారం వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

జీవన ఎరువులపై దృష్టి సారించాలి



పంటలను పరిశీలిస్తున్న మారుతిదేవి

కోవూరు: జీవన ఎరువులపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్ర ఏడీ మారుతిదేవి పేర్కొన్నారు. మండలంలోని వేగూరు, ఇనమడుగు, లేగుంటపాడు గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆమె మాట్లాడారు. సేంద్రియ ఎరువులను వాడే సమయంలో తేమ ఉండేలా చూడాలని సూచించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏడీ సుజాత, ఏఓ ఇందిరావతి, శిరీష, సుభాషిణి, శ్వేతలేఖ, చైతన్య, వంశి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



కృష్ణప్రసాద్‌రెడ్డి (ఫైల్)

విడవలూరు : మండలంలోని కామాక్షినగర్‌కు చెందిన 33 ఏళ్ల పాశం కృష్ణప్రసాద్‌రెడ్డి ఈనెల 22వ తేదీ నుంచి కనిపించడం లేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతని గురించి సమాచారం ఉంటే 94407 96326 నంబర్‌ను సంప్రదించి వివరాలు తెలియజేయాలని ఎస్సై సాయిప్రసాద్ కోరారు.

నేటి నుంచి ద్వారకామాయి వార్షికోత్సవ వేడుకలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయి తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓంసాయి శ్రీసాయి జయజయ సాయి నామ సంకీర్తనను ఆదివారం.. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత పెనుశిల లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

పంచాయతీ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. కౌన్సిల్‌లో ఎనిమిది అంశాలకు సంబంధించిన అజెండాలను ప్రవేశపెట్టగా, రెండు పనులకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారని చెప్పారు. మిగిలిన ఆరు అంశాలకు సంబంధించిన పనులను వాయిదా వేశామని తెలిపారు. కమిషనర్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కొందరు యువకులు మద్యం మత్తులో రాత్రిపూట విధుల్లో ఉన్న నగర పంచాయతీ సిబ్బందిపై ఇటీవల దాడి చేసిన విషయం తెలిసిందే. దాడిలో గాయపడిన ఇద్దరు కార్మికులకు చైర్‌పర్సన్ సుప్రజ తన కార్యాలయంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రూత్ బెనోమీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని కేపీఆర్ జూనియర్ కళాశాలలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ రూత్ బెనోమి మాట్లాడారు. ప్రిన్సిపల్ చిన్నయ్య, ల్యాబ్ టెక్నీషియన్ రవి తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్ఐటీ సేవలు హర్షణీయం

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



చిరు దుకాణాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

తోటపల్లిగూడూరు : డ్యామియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ సేవలు హర్షణీయమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి పెంచలయ్య అన్నారు. మండలంలోని మాచర్లవారిపాళెం పంచాయతీ గణపతినగర్‌కు చెందిన గోడ విజయమ్మ లెప్రసీ వ్యాధితో గత కొన్నేళ్లుగా బాధపడుతోంది. ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విజయమ్మకు సాయం చేసేందుకు డ్యామియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ ముందుకొచ్చింది. ఈ క్రమంలో సంస్థ రూ.45 వేల ఆర్థిక సాయంతో ఆమెకు ఓ చిల్లర దుకాణాన్ని ఏర్పాటు చేసింది. కాగా శనివారం మాచర్లవారిపాళెం విచ్చేసిన డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆ చిల్లర దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సహాయ, సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి, డాక్టర్ రాధిక, హెచ్‌ఈఓ కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ కృష్ణయ్య, క్షయ నివారణ సంస్థ డీపీఎస్టీ ప్రసాద్ ఆచారి, డ్యామియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంపింగ్ స్కీమ్ హెవీమోటార్ల చోరీ



ఆటోలో ఉన్న విద్యుత్ హెవీ మోటార్

పొదలకూరు : మండలంలోని డేగపూడి వద్ద కండలేరు పంపింగ్ స్కీమ్‌కు సంబంధించిన హెవీమోటార్లను ఆటోలో తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. ముగ్గురు వ్యక్తులు ప్రయాణికుల ఆటోలో పంపింగ్ స్కీమ్ విద్యుత్ మోటారును తరలిస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల కోసం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీనికి సంబంధించిన మరో మోటారు, సచివాలయం వద్ద ఉన్న 1 హెచ్‌పీ మోటారు కూడా చోరీకి గురైనట్లు సెక్రటరీ తన ఫిర్యాదులో సూచించడంతో రెండో హెవీ మోటారు ఎక్కడ ఉందో తెలియాల్సి ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో తరచుగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటార్లు చోరీకు గురవుతున్నాయి. అయితే పట్టుబడిన వారు దొంగలు కాదని ఎస్సై తెలిపారు. రోడ్డు పక్కన మోటారు పడి ఉంటే ఆటోలో తరలిస్తుండగా తమకు పట్టుబడినట్లు వెల్లడించారు. అసలు దొంగల కోసం గాలిస్తున్నామన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి



ముత్తుకూరు : పూజా కార్యక్రమంలో విద్యార్థులు

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నంలో ఉన్న అదానీ వరల్డ్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేశారు. రాధాకృష్ణుల వేషధారణలతో నృత్యాలు చేశారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు భగవద్గీత శ్లోకాలతో అలరించారు. గాయత్రి, భవిష్య తదితర విద్యార్థినులు భరతనాట్యంతో మురిపించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

• **పొదలకూరు :** పట్టణంలోని అమరావతి స్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిక, శ్రీకృష్ణుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. పిల్లలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కరెస్పాండెంట్ కె.సురేష్‌జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పొదలకూరు : గోపికల వేషధారణలో చిన్నారులు

• విజేత స్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కరెస్పాండెంట్ కామాక్షమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• **మనుబోలు :** మండలంలోని పిడూరుపాళెం గ్రామంలో ఉన్న ఉజ్వల ప్రైవేటు పాఠశాల ఆధ్వర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు, రుక్మిణి, సత్యభామ, గోపికల వేషధారణలో సందడి చేశారు. కరెస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి కృష్ణాష్టమి విశిష్టతను గ్రామస్తులు, చిన్నారులకు వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు.



ముత్తుకూరు : గోపికల వేషధారణలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



మనుబోలు : కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు